# మూడంత మబ్బు

దూరాన్న-పొలాల మీద చిన్న మబ్బు పట్టినట్టు కనిపించింది.

భాగ్యం భుజంమీది నిండుబిందె గుమ్మంలో దించింది. మనస్సులో అమృత వర్షం కురుస్తోంది.

చటుక్కున కాస్తభయం వేసింది. అతనేమనుకున్నాడో! నాఅమ్మ కడుపు బంగారంకాను! అదేమిటి, అల్లానవ్వాను? నవ్వు ఆపుకుని నిదానంగా వుండాలనైనా తోచలేదు! కాసేప్పటికి తోచింది. కాని, నాముఖంలో కనిపించే ఉంటుంది. ఆ అబ్బాయి నివ్వెర పోయాడు.

పది నిముషాల క్రితం నీలాటి రేవులో జరిగిన దంతా జ్ఞాపకం వచ్చింది. మళ్ళా అట్టే వీధి గుమ్మంలో నిలబడి పోయింది.

బిందె కాలుమీద మోపేటప్పటికే శేషయ్య ఎదురుగా చీలుబాట మీద ఆగాడు. శేషయ్య, భాగ్యం చిన్నప్పుడు కలసి ఆడుకున్న వాళ్ళే. ఎన్ని సార్లో పొలం గట్టు మీదకి పిల్లిపెసరకాయలకి వాళ్ళ ముతా వీళ్ళ ముతా కీచులాడుకునే వాళ్ళు. తన పెళ్ళయిన తరువాత భాగ్యం శేషయ్యతో మాట్లాడడమే మానేసింది. మరి, ఆదే మిటి అల్లా ఆగాడు ఎదురుగానే! భాగ్యం తలవంచుకుని బిందె ఎత్తుకో బోయింది.

"పెద్దిరాజు వస్తున్నాడు," అన్నాడు, భాగ్యం ముఖం చేటంతయింది! ఏమనడానికి తోచలేదు. కళ్ళుప్పగించి చూస్తూ ఊరుకుంది.

ఉన్నట్టుండి ఫక్కున నవ్వింది. వెంటనే తెలివి తెచ్చుకుని ముఖం నిబ్బరం

చేసుకుంది. శేషయ్య ఒక్క క్షణం ఖంగారు పడ్డాడు. కాని, వెకిలి చేష్ట అని, వచ్చిన చిరునవ్వు ఆపేసి కాలు కదిపాడు. నాలుగడుగులువేసి, వెనక్కితిరిగి రామగిరి పాడు బస్టుస్టాండులో చూశాను. వాళ్ళ ఫాక్టరీ యజమానిని బస్సు ఎక్కిస్తూ, "ఈ సాయంత్రం తప్పక ఇంటికి వెళ్ళిపోవాలి," అంటున్నాడు.

నేను కేక వేశాను. బజారు గొడవల్లో అతనికి నాకేక వినబడలేదు. నన్ను చూడనైనా చూడలేదు. "నిన్ను చూస్తే చెప్పబుద్దేసింది." అని వెళ్ళిపోయాడు.

తెప్పరిల్లి భాగ్యం బిందె ఎగరేసి ఎత్తుకుంది. ఈ వేళ బిందె తేలిగ్గా వుంది కూడాను.

ఇంటి కెళ్ళి పొయ్యి అంటించి వంట చెయ్యాలి. ఇప్పుడిక ఇల్లూ అదీ సుభ్రంగా సర్ది, అన్నీసరిగ్గా పెట్టాలి, అసలే బస్తీలో ఉండి వస్తూండె తను, ఎంతో నాజూగ్గా ఉండాలి ఇల్లు. లేకపోతే బావ మనస్సు ఎంత చివుక్కు మంటుందో !

ఏమి టేమిటో ఆలోచనలతో నడిచింది ఇంటికి. తన సంతోషానికి మేర లేదు. ఆమాయ దారి సంతోషమే శేషయ్య దగ్గర కూడా మర్యాద వుండ నివ్వ లేదు.

భాగ్యం ఇంట్లోకి వెళ్ళి, పొయ్యి రాజేసి బియ్యం చేటలో పోసింది.

ప్రక్కమునసబు గారి పెరట్లో నించి ఎడ్ల మెళ్ళల్లో మువ్వల గల గలలు, పాలేళ్ళ అదలింపులు విన బడుతున్నాయి. దుక్కి టెడ్లు దానా తింటున్నట్టు న్నాయి.

భాగ్యం ఇల్లు సర్దడం మొద లెట్టింది. గొంతెత్తి ఏదో కూనిరాగం కూడా ఆరంభించింది.

"మాడంత మబ్బు పట్టె మంగళ గిరి మీద
కురిసేను తిరుపతిలో కుంభవర్షాలు''

ఈపాట అత్తయ్య పాడేది. తన చిన్నప్పుడు, పాటంతా సరిగా జ్ఞాపకం లేదు.

"కుంభవర్షాల్ కురిసె స్తంభాలె తడిసె
వెంకన్న కూచున్న వెండరుగు తడిసె
మంగమ్మ కూచున్న మండసమె తడిసె''

మునసబుగారింట్లోనించి అపుడే పుట్టింటి కొచ్చిన సుబ్బులు. "ఏఁవక్కో, రాగా లెక్కువయినాయి! బావొస్తున్నాడా ఏం? అంటూ పెరటి గోడమీద ముఖం పెట్టింది."

భాగ్యం చిరునవ్వుతో తలవంచుకుంది. "నిజమే? చెప్పావు గావుగా?" అంది సుబ్బులు. భాగ్యం తలెత్తింది.

"ఏమమ్మా ఇంత చిక్కి పోయావు!'' అని ఆశ్చర్యపడ్డది సుబ్బులు. "అయినా చక్కని వాళ్ళు చిక్కినా సన్నని బట్ట మాసినా అందమే నంటారు పెద్దలు." అంది నవ్వుతూ.

బావ ఎంత చిక్కి పోయిఉంటాడో అనుకుంది భాగ్యం, బస్తీలో ఏ అమ్మ వండి పెడుతుంది! తనకిది ఇష్టమని చెప్పడు గదా. అసలేస్వయం పాకంమనిషి. అన్నట్టా సన్న చీరలు కట్టాలని ఎన్నాళ్ళనించో ముచ్చట సుబ్బులు చీరలు చూచాక. మరీ అనల్ల నేత చీర - జరీ చందమామలు వేసి నేసింది - తనకెంతో సరదా. బావ కొంటా నన్నాడు.

వంట చేసుకుంటోంటే గడచిన తన జీవితమంతా-తన కాపురం, అత్తగారు పోవడంలగాయితూ అన్నీ ఒక్కసారి వివరంగా జ్ఞాపకం వచ్చాయి భాగ్యానికి.

ఆయేడు చేను ఈనిన వెంటనే సుంకుమీద వాన ముసుళ్లు పట్టాయి. ఎల్లాగో కాల క్షేపం చేశారు. ఆమరుసటి ఏడూ అంతే.

తరువాత ముంపు వచ్చింది-వరుసగా రెండేళ్లు. అసలు ఆయేడు ముంపు వస్తుందని భాగ్యానికి కూడా ముందరే తెలుసు. తొలకరికి ముందు ప్రక్క ఊళ్ళో ఉన్న చుట్టాలని చూసి వస్తూంటే కొల్లేరు ఎండిఉంది. అక్కడక్కడ గుంటలలో నీళ్ళు ఉన్నాయి. జమ్ము నిలువెత్తుకి పైగా పెరిగి ఉంది. రాజు చూడమన్నాడు. జమ్ములో కొంగలు నిలు వెత్తున్న గూళ్ళు కట్టు కున్నాయి. పెద్ది రాజు నిలబడి పోయాడు. "ఈయేడు ముంపు వస్తుందే. మనగతి ఏమిటో! గూళ్ళు చూడు. ఎంత ఎత్తుగా కట్టాయో పిట్టలు, ఈయేడు!" అన్నాడు. భాగ్యం క్రుంగి పోయింది.

"మన పల్లపు చేలకి ఈగతి తప్పదుగా.'' అన్నాడు మరో ఆయన ప్రక్కన నిలబడి - భాగ్యంతో.

ఇపుడు జ్ఞాపకం వస్తోంది. ఆ అన్నది శేషయ్యే. వాళ్ళింటికే వెళ్లి వస్తూంటే, సాగనంపటానికి కూడా వచ్చాడు. అదేం? బావ అల్లా మిరి మిరి, చూశాడు? తాను శేషయ్యతో మాట్లాడితే బావ కిష్టంలేక పోయేది! అసలు భాగ్యం మాట్లాడేదే కాదు. ప్రయాణంలో ఏదో సందర్భంలో అవసరం వచ్చింది. తను జవాబు చెప్పింది. ఏదో కొంటెగానో చెప్పినట్లు జ్ఞాపకం;-బావ అండ చూసుకుని శేషయ్య నవ్వాడు. కాని బావకోపం దిగ మింగాడు. ఇంటికొచ్చే వరకూ ఎవ్వరూ ఏమీ ఎక్కువ మాట్లాడలేదు. ఊరు పెద్ద చెరువు గట్టుమీద నించే, శేషయ్య భద్రంగా వెళ్లి రమ్మని తిరుగు ముఖం పట్టాడు.

అసలు బావ తను ఎవ్వరితో మాట్లాడినా ఒప్పు కోడు. తను అదో మోస్తరు. మిగత విషయాల్లో దేవుడి లాంటివాడు.

భాగ్యం, తృప్తితో చిరునవ్వుతో తల వంచుకుని కూరలు తరుగు తూంది.

అల్లాగే ఇదివరలో ఓనాడు బావ సంతకి వెళ్లి మర్నాడుగాని రానన్నాడు. అంతా జ్ఞాపకం వచ్చింది. ఒకవేళ ఎల్లా పోయి ఎల్లా వస్తుందో ఎందుకైనా మంచిదని ఓలోటా పాలు కాచి కిటికీలో పెట్టింది. మునసబుగారి భార్య రెండు బంతి పువ్వు లిస్తే తల్లో పెట్టుకుంది. అనుకున్నట్టు సంతలో పడ్డ బేరం కుదరలేదు. పెద్దిరాజు ఆనాడే ఇంటికి తిరిగి వచ్చాడు. కాచినపాలు, తల్లో పువ్వులూ చూసి చాలా చికాకు పడ్డాడు. భాగ్యానికి అర్థం కాలేదు. ముఖంచిన్న పుచ్చు కుంది. భాగ్యం పాల వైనం పువ్వుల వైనం బ్రతిమాలి చెప్పే టప్పటికి ఆ రాత్రి తొలికోడి కూసింది. తన అను మానాలకే పెద్దిరాజు చాలా సిగ్గు పడ్డాడు. చాలా నొచ్చుకున్నాడు.

భాగ్యం అర్థం చేసు కుంది. "పోనిలే నామీద నువ్వు కోపగించుకో పోతే ఇం కెవ్వరు కోపగించు కుంటారు బావా వెర్రిగాని!'' అంది. కాని తనకీ కోపమే. ఒక్కొక్కసారి, ఇక ఇట్లా కోపగించుకో కూడదు; అసలు బావ ఎంత అనుమానంగా ప్రవర్తించినా తనే ఓపికగా వుండాలి. బావ రాగానే ఈ ముక్క చెప్పేద్దామని నిశ్చయించింది, భాగ్యం.

మేన కోడల్ని పెంచి కొడుక్కి చేసుకుంది అత్తయ్య. పుట్టింటి వారులేని కొరత లేకుండా చూస్తాడు పెద్దిరాజు. భార్యని అరచేతిలో నిమ్మపండులా చూసు కుంటాడు అనుకుంది.

ఒకసారి మునసబు గారిభార్య రెండు తామరకాయ లిచ్చింది. "నాకివి చానా ఇష్టం చిన్నమ్మా" అంది భాగ్యం. విననట్టే ఉన్నాడు బావ, చద్దన్నం తింటో, రెండో నాటికి సందెడు కాయలు వచ్చి పడ్డాయి ఇంట్లో! భాగ్యం గుండె నీరై పోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బావకి నీటిగండం ఉందని అంటూండేది అత్తయ్య.

అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

కనకం–వాళ్ళ ఆవు మునసబు గారింట్లో ఒక్క రంకె వేసింది.

చివరికి ఆవుని కూడా మునసబుగారికి తోలవలసి వచ్చింది. ఒక కష్టమా! వరుసగా చేలు పండక అప్పుల పాలైనారు భాగ్యమూ, రాజూ. ఆఖరికి గత్యంతరం లేక రామగిరి పాడు బస్తీలో కూలిపనికైనా ఒడ బడ్డాడు; ఉన్న ఊళ్ళో అయితే పువ్వు లమ్మిన వూళ్ళో కట్టెలమ్మి నట్టుంటుంది అని. పైగా, బస్తీకిపోయి నాలుగు రాళ్లు సంపాదిస్తే, అప్పులు తీరితే అదేచాలు. ఈసారి నడుంకట్టి పొలంలో బంగారం పండిస్తా నన్నాడు రాజు.

నాళ్లు గడిచినాయి. వర్షాలు ఎక్కువగా కురిశాయి. చెరువులో తామరలూ కలువలూ కలకల లాడు తున్నాయి. చేలల్లో నీళ్లు నిలగట్టారు.

స్వతంత్రం, నమ్మకంమీద మునసబు గారినే నూర్చి కుప్ప వెయ్యమని చెప్పి బస్తీకి బయలు దేరాడు రాజు. త్వరలోనే తిరిగి వస్తా నన్నాడు.

ఆనాటి దృశ్యం కళ్ళకి కట్టినట్లుంది భాగ్యంకి. రోజంతా అదోమాదిరిగా ఉన్నాడు రాజు. ఏదో బాధపడుతున్నట్టూ కనిపించాడు. ఆ ముఖం జ్ఞాపకం వచ్చినపుడల్లా భాగ్యానికి కడుపు తరుక్కు పోతుంది.

ఆనాడు భోంచేస్తూ, "నువ్వు ఒంటరిగా ఉండగలవా?'' అని ఛటాలున అడిగాడు.

"నీతో నేను వస్తా," నన్నది. రాజు కళ్లెర్రజేశాడు. "బస్తీ నమ్మకూడదు. అక్కడి కొద్దు,'' అన్నాడు. భాగ్యం మాట్లాడలేదు. సుబ్బులూ వాళ్ళంతా బస్తీపోవడం లేదూ? బావ కిష్టంలేదు. అంతే! "ఇక్కడేమన్నా వెర్రిచేష్టలు చేశావా, నేను దేశాం తరం పోతా," అన్నాడు భాగ్యం గుండె గబగబా కొట్టుకుంది. "అదేమిటల్లాగ!'' అంది గాభరాగా.

రాజు చిరునవ్వు తెచ్చుకున్నాడు, "బయపడకు. నాకసలు కోపం ఎక్కువ,'' అన్నాడు.

భాగ్యం మనస్సు మరింత బరువెక్కింది. రోజంతా ఇద్దరూ మాట్లాడకుండానే గడిపారు.

ఆ సాయంత్రం, "రేపీ వేళకి బస్తీలో ఉంటావు బావా! పల్లెటూరు జ్ఞాపకం ఉంచుకుంటావా? మేము జ్ఞాపకం ఉంటామా?'' అని చిరునవ్వు తెచ్చుకుని అంది భాగ్యం.

పంచెలు మడతలు పెట్టుకుంటున్నరాజు తలెత్తకుండా, "నల్ల జలతారు చీరతెస్తానులే,'' అన్నాడు కొట్టొచ్చినట్టు.

మరోక్షణం గడిచింది. "అసలు ఇంతకష్టం నాకెందుకు-నీకోసం గదూ? మనం ఎప్పుడూ ఇట్లాగే ఉంటామని ఎట్లా చెప్పడం? పెద్దలు గడించినదైనా తరువాత వాళ్ళకి ఇచ్చిపోవద్దూ?' అన్నాడు వినీ వినబడని స్వరంలో. భాగ్యం గుండె కరిగి పోయింది. బావ మోస్తరే అది!

మరునాడు తూర్పు తెల్లవారకముందే బస్సురోడ్డుకి బయలు దేరాడు పెద్దిరాజు. పొలం గట్టువరకూ సాగనంపి వస్తానని, మునసబుగారు కూడా పొన్నుగర్ర చేత పట్టుకుని బయలుదేరాడు.

"ఇక నువ్వుండు, భద్రం,'' అని మాత్రం అన్నాడు పెద్దిరాజు.

"నేను సాగనంపి వస్తానులే. ఇక నువ్వు ఇంటికి పదమ్మాయి,'' అన్నారు మునసబు గారు.

అక్కడే వీథిచివరనే ఆగిపోయింది భాగ్యం. నోటమాట రాలేదు. తన గుండె లెవ్వరో బలవంతంగా ఈడ్చుకుపోతున్నట్లయింది తనకి.

మసక మసకగా ఇద్దరు మగాళ్ళూ రోడ్డుమలుపు దాటాక భాగ్యానికి గొంతు వచ్చింది, "శుభంగా వెళ్లి లాభంగా తిరిగి రా''మ్మంది.

ఆ దీవెన్ని ఆకాశంమీద ఆఖరు చుక్కమాత్రం విన్నది.

నాటినించీ భాగ్యం జీవితం బరువుగానే నడుస్తున్నది. ఒంటరిగా గుప్పెడు బియ్యం ఉడకేసుకుని తినడం అంటే "ఎందుకులే!'' అనిపించేది, క్షుద్బాధకోసం

ఆనాలుగుగింజలూ పొయ్యిమీద పెట్టినప్పుడల్లా, రాజు తిన్నాడో లేదో, ఎల్లా ఉన్నాడో! అక్కడ ఎవ్వర్ని అడుగుతాడు! అడిగే మనిషికాదాయె-అన్న బాధ ఎక్కువయ్యేది. కళ్ళల్లో నీళ్ళు చిమ్ముకొచ్చేవి.

నురిపిడి అయిపోయింది. అసలే సారంలేని భూమి. తప్పా తాలూపోనూ ఏదో గ్రాసానికి మట్టుకు గింజలు చేరాయి. మునసబు గారు తన ఇంట్లోనే గరిసె కట్టించారు.

కాని, హృదయంలో బరువు తగ్గలేదు. సూర్యభగవానుడు అటు ఉదయించి ఇటు కృంగుతున్నాడు. నిన్న నేడూ అనే వివక్షత లేకుండా రోజులు గడిచిపోతున్నయి భాగ్యానికి.

పెరట్లో బూరుగుచెట్టు పువ్వుపూసి కాయ కాసింది. వేసవి గడుస్తూంది.

సంపాదన లేకపోతేపోనీలే, పొలంపోతేపోనీ ఒక్క గూట్లో పడిఉంటే చాలు. మునసబుగారిచేత కార్డు వ్రాయిద్దామా అనుకుంది కూడాను ఎన్నోసార్లు-భాగ్యం. రాజు ఛటుక్కున వినే మనిషి గాదు. అప్పు తీర్చకపోతే నామోషీ పడతాడు. అప్పుడే నాలుగైదుసార్లు తపాల్లో డబ్బు పంపాడు మునసబుగారి పేర. చేతి ఖర్చుకి ఆ డబ్బు తనకే ఇవ్వమన్నాడు.

మృగశిర ప్రవేశించింది. మునసబుగారు తన మళ్ళతోపాటు రాజు దుక్కి కూడా ఆరంభించారు.

అనుకోకుండా ఈ వేళ బావ వస్తున్నాడు.

ఈ పరమానందంలో వంట అయిపోయింది. బయట చిన్న చిన్న చినుకులు ఆరంభమయినయి. వెలిగించిన హర్రికేనులైటు చుట్టూ నుసుములు బొంయ్ బొంయ్ మంటూ తిరుగుతున్నయి. మునసబుగారి గొడ్లసావిట్లో, పశువులకిపెట్టిన కుమ్మపొగ ఇల్లంతా అలుముకుంది.

రెండు కంచాలు కడిగింది భాగ్యం.

ప్రక్కప్రక్కన పీటవేసి కంచాలు పెట్టింది. తన ధైర్యానికి తనకే ఆశ్చర్యం వేసింది.

అసలు కాపురం మొదలెట్టాక ఇద్దరూ కలసి భోంచెయ్యందే! ఆ సరిక్రొత్త ముచ్చట్లు ఏమో, అంతే!

రెండులోటాల్తో నీళ్లు పెట్టింది. స్వయంగానే వడ్డించుకుని తినొచ్చు. సుబ్బులూ వాళ్ళాయనా బస్తీలో ఇంతేనట. సుబ్బులు ఎన్నోసార్లు చెప్పింది.

అప్పుడే, సుబ్బులు పంపించిన బస్తీఆకులు, వక్కలూ మంచంమీదనేపెట్టి ఉంచింది. కబుర్లు చెప్పకుంటూ సున్నం రాసుకోవచ్చు ఆకులకి.

కొంపతీసి బావ అనుమానం పడడుగదా! తన అనుమానాలకి తనకే నవ్వొచ్చింది భాగ్యానికి! అయినా బావని నవ్వించేద్దాం అనుకుంది.

రెండు రవికలూ మార్చి మార్చి తొడుక్కుంది శ్రద్ధగా.

అన్నం తినంగానే బెల్లంగడ్డ నోట్లో వేసుకునే అలవాటుంది బావకి. ఇంట్లో బెల్లం లేదు. వీధిచివర భూషణంగారింట్లో అమ్ముతారు. తానెప్పుడూ వెళ్ళలేదు. పైగా బయట సన్నగా జల్లు పడుతూంది. మరి బెల్లం లేదే - ఎట్లా ?

బావకి ఇంటిముందర దారి తెలియటానికి లైటు పడేటట్టు కిటికీ తెరిచిపెట్టి, తలుపు గొళ్లెంపెట్టి, తడుస్తూ బయలుదేరింది.

"ఏం కోడలూ వానలో వచ్చావు? దా," అంటూ చాప చూపించింది జానికమ్మ గారు, భూషణంగారి భార్య. భాగ్యం ముస్తాబు చూసి తబిసీళ్లు అడిగి తెలుసుకుంది. బెల్లం చేతికిచ్చి, బొట్టెట్టివాళ్ళ చిన్నవాణ్ణి తోడిచ్చి తిరిగి పంపింది. వర్షం కొంచెం పెద్దదయింది. తలుపు తియ్యగానే హరికేనులైటు గప్ గప్ మంది - బైట గాలి విసురికి.

తాను బస్సురోడ్డు చూస్తూ, గుమ్మం లోపలగా కూచుంది-తలుపుని ఆనుకుని. ఇటు తిరిగి ఇంట్లోకి చూసింది - తెరిచిన కిటికీ లోంచి జల్లుపడ్డదల్లా వుంది. కిటికిలోపల క్రింద, క్రీనీడ తడిసి నల్లగా వుంది. అయినా కిటికీ మూయదలచు కోలేదు. మూస్తే బావ దారికి చీకటి.

వర్షం మరింత పెద్దదయింది. గాలి విసురు ఎక్కువయింది. మెరుపు మెరిసి నపుడల్లా ఎదురుగా బస్సురోడ్డు క్షణంసేపు కనిపిస్తోంది. అల్లాగే బయటికి చూస్తూ కూచుండి పోయింది భాగ్యం; నిద్రమాత్రం రావడం లేదు.

రాత్రి రెండు జాము లయింది. బయట గాలి హోరు ఎక్కువయింది. భాగ్యానికి భయంవేసింది. ఇక ఈ రాత్రి బావ రాడు. ఇక రేపే, పోనీలే. ఈ దారి వర్షంలో ఏం ముంచుకు పోయిందని తను తడవడం అనుకుంది.

కిటికీలోనించి జల్లు నట్టింటి వరకూ పడుతూంది. భాగ్యం లేచి కిటికీ మూయ యింది.

కిటికీ క్రీనీడలో కాలుక్రింద మెత్తగా ఏదో వస్తువు తగిలింది. భాగ్యం చటుక్కున నక్కి గెంతింది.

ఇందాక బయటనించి రాగానే కనిపించింది ఇదే – తడికాదు. మసక లుతురులో అల్లా కనిపించింది.

దీపం తెచ్చి దగ్గరగా చూసింది. ఓ చిన్న బొక్కిసా అది. చేత్తో మెల్లగా త్తింది. బావ నీలం చొక్కాయిలో చుట్టిన ఏవో గుడ్డలు మెత్తగా తగిలాయి.

అయితే బావ వచ్చేశాడు. ఏడీ? మునసబుగారింటికి వెళ్ళాడా ఏం – తను ంట్లో లేనందువల్ల ! అపుడే వచ్చిఉండాలి. అయితే, ఇంతసేపు వారింట్లో ఏం స్తున్నాట్లూ? గుమ్మంలోకి వెళ్లి వంగి ప్రక్కఇల్లు చూసింది. తలుపులన్నీ మూసి న్నాయి, దీపాలే లేవు. వాళ్లంతా ప్రశాంతంగా నిద్రపోతున్నారు.

భాగ్యానికి ఏమీ తోచలేదు. ఆలోచనలు పరిగెత్తుతున్నాయి. లోపలికి ఉరికింది. ఆ మూటని నిదానించి చూసింది. మెల్లగా విప్పింది. లోపల బావ తీసికెళ్లిన గుడ్డలూ, క్రొత్తది ఓ నల్లటి చీరా ఉన్నాయి. దీపం వెలుగులో చీరమీద జరీ అక్కడక్కడ తళతళ లాడింది. జరీ చందమామల చీర. తనకోసం. ఎంత జ్ఞాపకం పెట్టుకు తెచ్చాడు బావ! అయితే కిటికీక్రింద తడిలో పెట్టడమేం-మంచం మీద పెట్టకుండా ?

భాగ్యానికి వెర్రి ఎత్తినట్టని పించింది. తల పడిపోతున్నట్టయింది. అక్కడే చతికిలబడి పోయింది.

మరుక్షణం ఇటువైపుగా కంచాల మధ్య చెల్లాచెదురుగా ఏవో పడిఉన్నాయి. తన కాళ్లకి దగ్గరగా బావ మనీపర్సు పడిఉంది. చేతికి చాలా బరువుగా వుంది. ఓ బస్సు టికెట్టు, ఒక రసీదు, వేలెడు కర్ర పెన్సిలూ పడివున్నాయి. గుప్పున అర్థం

అయింది-భాగ్యానికి. కిటికీలోంచి విసిరిపుచ్చుకొని బావ లోపలి కిసిరేశాడు-వీటన్నింటినీ. కోపంగా వేసినట్టుంది. ఎందు కంత కోపం ? వేసి ఎక్కడికెళ్ళాడు? తల పగిలిపోతూంది!

బయట చూరునీళ్లు కిటికీప్రక్కగా ఏకధారగా పడుతున్నాయి. గాలి ఈల వేస్తోంది. వర్షం ఎక్కువయింది. కుంభ వృష్టి.

భాగ్యం వీపుమీద జల్లుపడుతూంది. మెదలలేదు. బిత్తర చూపులు చూసింది. తనచుట్టూ ఉన్న వెలుగులూ, నీడలూ ఒకేలాగు కనిపించాయి, భాగ్యానికి. కళ్ల నిండా నీళ్లు నిండాయి.

మరుక్షణమే తన వెనక ఆకాశంమీద పెద్ద మెరుపు మెరిసింది. కళ్లముందు తళతళా తోమిన రెండు కంచాలు రెండు లోటాలు తళుక్కున మెరిసాయి.

బయట వర్షపు ధార.

✤ ✤ ✤